

# నేనే నా ఆయుధం

## – డా.యండమూరి వీరేంద్రనాథ్



## సామాన్యుడి అసామాన్య విజయం.. ఒక యదార్ధ గాధ!

"ఢిల్లీలో రాష్ట్రపతి భవన్ బ్రేక్‌ఫాస్ట్ టేబుల్ ముందు కూర్చున్నప్పుడు... కాకినాడలో పోస్టర్లు అతికించటానికి వాడగా మిగిలిపోయిన మైదా పిండితో చపాతీలు కాల్చుకుని తిన్న రోజులు గుర్తొచ్చి కళ్ళ నీళ్ళొచ్చాయి".

వ్యాపారంలో పోటీ... ఎత్తులు – పైఎత్తులు... విస్తరించటానికి చేసే ప్రయత్నాలు... ఎక్కే శిఖరాలు, పడే లోయలూ...

ఆర్టీసీ బల్లల మీద నిద్ర... సులభ్ కాంప్లెక్స్‌లలో స్నానం..! పదో క్లాసు ఫెయిల్ నుంచి... డాక్టరేట్ వరకూ..!

అట్టడుగు స్థాయి నుంచి లక్షల సంపాదన వరకూ ఎదిగిన ఒక నిరుద్యోగి జీవిత చరిత్ర...!

ప్రతీ నిరుద్యోగీ, వ్యాపారవేత్తా, జీవితంలో పైకి రావాలనే తపన ఉన్న

ప్రతి వ్యక్తీ చదవవలసిన పుస్తకం.

మాస్టర్ రైటర్

**యండమూరి వీరేంద్రనాథ్** కలం నుంచి...

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

34

కుప్ప నూర్చిన తర్వాత, వేసవిలో బళ్ళు వేసుకుని మేము చెరువు దగ్గరకు వెళ్ళేవాళ్ళం. అప్పటికి చెరువులు ఎండిపోయి ఉండేవి. అందులో ఒండ్రుమట్టి చాలా సారవంతమైనది. దాన్ని బళ్ళలో తీసుకొచ్చి పొలాల్లో నింపేవాళ్ళం.

మా విద్యార్థుల్లోనే ఎంతోమంది మేధావులుండేవారు. వారిలో ఉండే నైపుణ్యాన్ని పసిగట్టి ట్రైనింగ్ ఇచ్చి, మా దగ్గరే ఫ్యాకల్టీగా నియమించవచ్చన్న సూత్రాన్ని అక్కడి నుంచే నేర్చుకున్నాను.

బయట నుంచి ఎక్కడి నుంచో ప్రొఫెషనల్స్‌ని తీసుకు వచ్చి పెట్టటం కన్నా మన పొలం పక్కనే ఉన్న సారవంతమైన మట్టిని మన పొలంలో నింపుకోవటం లాభదాయకం కదా!

మేధలో పని చేసే స్టాఫ్ అంతా దాదాపు మా పూర్వ విద్యార్థులే. ఇలా పూర్వ విద్యార్థులని మా సంస్థలో అధ్యాపకులుగా నియమించటానికి మరికొన్ని కారణాలు ఉన్నాయి.

వీళ్ళు పాఠాలు చెపుతున్నప్పుడు "ఒకప్పుడు నేనూ మీలాగే..." అన్న పదాల్ని తరచూ ఉపయోగిస్తారు. మేము ఇదే సంస్థలో చేరినప్పుడు తెలుగు తప్ప మరొక భాష రాదు. ఇప్పుడు మేము ఎలా మాట్లాడుతున్నామో చూస్తున్నారు కదా" అని ఉదాహరణతో సహా చెప్పటం విద్యార్థుల్లో నమ్మకాన్ని పెంచుతుంది.

'నేనిక్కడే చదువుకున్నాను" అంటూ, పై భావాన్నే స్వచ్ఛమైన ఇంగ్లీషులో మా రిసెప్షనిస్టు చెపుతున్నప్పుడు చేరటం కోసం వచ్చేవారికి సంస్థ పై నమ్మకం ఏర్పడుతుంది.

నేను విద్యార్థులతో ఎలా ఉంటానో నా స్టాఫ్‌కి కరెక్టుగా తెలుసు. వారు ఫ్యాకల్టీ అయినప్పుడు అదే నమ్రతా, వినయమూ, దగ్గరితనం, ఆత్మీయతా మొదలైనవన్నీ విద్యార్థులపట్ల చూపిస్తారు.

ఈ మూడు కారణాలవల్లే నేను ఎప్పుడూ మా సంస్థలో మా పూర్వ విద్యార్థులని చేర్చుకుంటూ ఉంటాను. అయిదారు వేల జీతానికి చేరిన వారు ప్రస్తుతం పదిహేను, ఇరవై వేలు సంపాదిస్తూ సంతృప్తితో ఉంటారు. మేధలో ఈ విధమైన ఒక కుటుంబ వ్యవస్థను నిర్మించానని నేను గర్వంగా చెప్పుకోగలను.

---

నిరంతర కృషీ, పట్టుదలా... వీటిని ఆయుధాలుగా చేసుకున్న మేధ పేరు అటు శ్రీకాకుళం నుంచీ, ఇటు కాకినాడ వరకూ శాఖోపశాఖాలుగా విస్తరించసాగింది. విద్యార్థులు దూరప్రాంతాల నుంచి కూడా రావటం మొదలుపెట్టారు.

అయితే చాలామంది విద్యార్థులు మేధలో చేరటానికి విశాఖపట్నం వరకూ వచ్చే ఆర్థికస్థోమత లేనివారు అయి ఉండవచ్చు. వారి కోసం ఒక పుస్తకం వ్రాస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన కలిగి '5 Elements of English' అనే పుస్తకం వ్రాశాను.

మనిషికి కావలసిన అయిదు ముఖ్య అవసరాలను సమకూర్చే వాటిని పంచ భూతాలు అంటారు. పుస్తకపు అధ్యాయాలకి వాటిపేర్లే పెట్టాను.

EARTH

ఈ అధ్యాయంలో vocabulary గురించి చర్చించటం జరిగింది. విత్తుకు మూలం భూమి. భూమి సారం మీదే, పెరిగే విత్తనం తీరు ఆధారపడి ఉంటుంది. అదే విధంగా భాషకు మూలం vocabulary.

ఆంగ్ల భాషలో మన అభిప్రాయాలు అవతలివారికి చెప్పటానికి వేయి పదాలు తెలిస్తే చాలని గతంలోనే అనుకున్నాము. అదే మూడువేల పదాలు తెలిస్తే అద్భుతంగా మాట్లాడవచ్చు. అయిదువేల పదాలు తెలిస్తే భాషలో ఆంగ్లంలో గొప్ప ప్రావీణ్యం ఉన్నవారికి కూడా మనం భోదించవచ్చు.

తాను ఏ స్థాయిలో ఉండాలనేది ప్రతీ విద్యార్థీ తనకు తానే నిర్ణయించుకోవాలి. ఒక మెకానికల్ ఇంజనీర్‌కి అయిదు వేల పదాల ఆవశ్యకత లేదు. ఇంగ్లీషు లెక్చరర్‌కి కనీసం మూడు వేలు తెలిసుండాలి. ఇది Earth అధ్యాయం తాలూకు సారాంశం.

WATER

నీళ్ళు మూడు రకాల స్థితుల్లో ఉంటాయి. మంచు, నీరు, ఆవిరి. వీటిని మూడు ‘Tenses’కి అన్వయించాను. గతం, వర్తమానం, భవిష్యత్తు.

నీరు ఎప్పుడూ ప్రవహిస్తూనే ఉంటుంది.

దీన్నే ‘ఫ్లో’ అంటారు.

ఎప్పుడైతే నీకు ఈ మూడు ‘Tense’ల మీద అధికారం వచ్చిందో అప్పుడు నీ మనసులోని మాటను అవతలివారికి అద్భుతంగా వ్యక్తీకరించగలవు. తడబడకుండా చెప్పగలవు.

దాన్ని కూడా ‘ఫ్లో’ అనే అంటారు.

SKY

గాలి అనంతం. గాలి లాగే ఇంగ్లీష్‌లో ‘Prepositions’ కూడా అంతం లేనివి. ఒక వ్యక్తి ఆంగ్ల భాషా పరిజ్ఞానం ఎంత? అనేది అతడు వాడే ‘Prepositions’ ద్వారా తెలుసుకోవచ్చు. ఈ ‘Prepositions’ తాలూకు వాడకం ఎంత బాగా తెలిస్తే, భాష మీద అంత పట్టు వస్తుంది.

ఉదాహరణకి ‘AT’ అన్న పదానికి అర్థం 'వద్ద'.  కానీ దీనిని పది సందర్భాల్లో పది రకాలుగా ఉపయోగించవచ్చు. ‘Iam looking at you’ అంటే 'నేను నీ వైపు చూస్తున్నాను' అని అర్థం.  ‘You are at the bus-stop’ అంటే నువ్వు బస్‌స్టాప్ దగ్గర ఉన్నావు. ఈ విధంగా ఒకే పదాన్ని పలు రకాలుగా వాడటం ద్వారా అవతలివారికి మన భావాలని వివిధ రూపాల్లో స్పష్టంగా వ్యక్తీకరణ చేయొచ్చు.

‘You are at 60’ అన్నప్పుడు ‘నీ వయసు అరవై’ అన్న అర్థం వస్తుంది. అదే సైకిల్ మీద ఉన్నప్పుడు 'You are at 80' అంటే 'నువ్వు యెనభై కిలోమీటర్ల వేగంతో బండి నడుపుతున్నావు' అన్న అర్థం వస్తుంది.

ఈ విధంగా ‘AIR’ అనే ఈ అధ్యాయమంతా ఆంగ్ల భాష సొగసులకు మూలాలైన Prepositions గురించి ఉంటుంది.

AIR

‘ఒకే పదాన్ని వేర్వేరు అర్థాలతో ఉపయోగించటం ఎలా’ అన్నది SKY అన్న అధ్యాయంలో వివరించటం జరిగితే – ‘ఒక భావాన్ని రకరకాల పదాల సమ్మేళనలతో చెప్పటం ఎలా’ అన్నది AIR అన్న అధ్యాయంలో వివరించటం జరిగింది.

verb పక్కన పెట్టే పదం బట్టి ఆ verb తాలూకు అర్థం మారుతుంది ఉదాహరణకి .'Look at' అని వాడినప్పుడు 'ఒక విషయం మీద దృష్టి కేంద్రీకరించటం' అనే అర్థం వస్తుంది .‘Look into’ అని వాడినప్పుడు 'పరిశీలించటం' అనే అర్థం వస్తుంది .‘Look for’ అని వాడితే ‘వెతకటం’ అనే అర్థం వస్తుంది .‘Look after’ బాగోగులు చూసుకోవటాన్ని సూచిస్తుంది.

ఇలా ఒక క్రియ పక్కన వచ్చే పదం బట్టి  ఆ verb తాలూకు అర్థం మారుతుంది. ఇలా ఇంగ్లీష్ లో క్రియ తర్వాత వాడే పదాలు చాలా ఉంటాయి .ఇదే ‘Sky’ అనే అధ్యాయం సారాంశం.

FIRE

Emotions, obligations, Intentions... ఈ మూడు ఎమోషన్స్‌నీ ఇంగ్లీషులో ‘Model verbs’ అంటారు. ఈ అధ్యాయం అంతా ‘Model verbs’ గురించి చర్చించబడింది. మనిషి తాలూకు రకరకాల ఎమోషన్స్‌ని ఇంగ్లీషులో ఏ విధంగా ప్రకటించాలి అనేది ఇక్కడ

చర్చించబడింది. 'You can do it', 'You will do it', 'You must do it', 'You should do it' అనే వాక్యాలు ఒకసారి పరిశీలిస్తే ఈ 'Model verbs' తాలూకు ప్రాధాన్యత తెలుస్తుంది.

# 35

ఈ పుస్తకాన్ని ముగించే ముందు నా కుటుంబం గురించి కాస్తయినా చెప్పక పోతే ఆ లోటు అలాగే ఉండిపోతుంది.

5 elements of fire పుస్తకాన్ని బర్మింగ్‌హాం యూనివర్సిటీలో మేయర్ రిలీజ్ చేశారు. ఈ పుస్తకం ఎంత ప్రాచుర్యం పొందిందంటే, దాదాపు అయిదు సంవత్సరాల్లో లక్ష కాపీల దాకా అమ్ముడుపోయింది.

ఇదే పుస్తకాన్ని మేము విశాఖపట్నంలో ఆవిష్కరించినప్పుడు ముఖ్య అతిథిగా యండమూరి వచ్చారు.

ఆయన పుస్తకాన్ని ఆవిష్కరిస్తూ ఉండగా నేను పక్కన నిలబడదామని అభిలషించాను. దానికి ప్రెస్‌ని కూడా సిద్ధం చేసాను.

కానీ ఆయన ప్రారంభోపన్యాసం ఇస్తూ నా భార్యని స్టేజ్ మీదకు పిలిచి, "ప్రతీ మగవాడి విజయం వెనుకా ఒక స్త్రీ ఉంటుందంటారు. కానీ తన విజయం వెనుక మౌనంగా ఉండే స్త్రీ నిశ్శబ్దాన్ని అర్థం చెసుకోవటమే మొగవాడి నిజమైన విజయం" అని అర్థం వచ్చేలా మాట్లాడారు.

అప్పుడు నాకు అర్థమయింది నేను చేసిన తప్పేమిటో.

అప్పటివరకూ జరిగిన ప్రతీ ఫంక్షనుకీ నేనే సూటు వేసుకుని కూర్చునేవాడిని. కానీ పని ధ్యాసలో నేను ఎంత పట్టించుకోకపోయినా... మౌనంగా, నిశ్శబ్దంగా నా వెనుక ఉండి నన్ను నడిపించిన వ్యక్తిని స్టేజి మీదకు పిలిచి, ఆమెతో ఆయన ఆ పుస్తకాన్ని ఆవిష్కరింపజేయటం నా జీవితంలో మర్చిపోలేని సంఘటన.

ఆ రోజు నుంచీ ఈ రోజు వరకూ నేను ప్రతీ సందర్భంలోనూ నా భాగస్వామిని కలుపుకుంటూనే వచ్చాను.

వివాహం జరిగిన కొత్తలో దూరపు ప్రాంతాలకు వెళ్ళినప్పుడు హొటల్‌లో అక్కడి లెటర్ ప్యాడ్ మీద నా భార్యకి ఉత్తరాలు వ్రాసేవాడిని. ఒక్కోసారి నేను వచ్చేసిన తర్వాత అవి పోస్టులో వచ్చేవి. అలాంటి ఉత్తరాలు దాదాపు వంద ఆమె దాచుకుంది.

ఇదంతా గొప్పగా చెప్పుకోవటం కాదు.

ఒక సామాన్యుడు ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే యుక్తవయసులో కుటుంబానికీ, సంసారానికీ ఇవ్వగలిగే సమయం చాలా తక్కువ ఉంటుంది. కానీ ఆ కొద్ది సమయంలోనే మన దగ్గరవాళ్ళు మనకి మానసికంగా ఎంత అవసరమో చెప్పటం కోసం, ఇలాంటి చిన్న చిన్న విషయాలు దోహదపడతాయి అని చెప్పటమే నా ఉద్దేశ్యం.

...

కుటుంబంతో సహా హైదరాబాద్ వచ్చిన కొత్తలో ఒక్కడినే నాలుగు బ్రాంచ్‌లు చూసుకోవాల్సి రావటంతో సంసారాన్ని పట్టించుకోవటానికి క్షణం కూడా సమయం దొరకలేదు. అన్నీ ఒక్కడినే చూసుకోవాల్సిన పరిస్థితి. ఆ సమయంలో నా భార్య ఒక పుస్తకం తీసుకొచ్చి చూపించింది.

అది మా చిన్నమ్మాయి నోట్ బుక్.

అందులో ఆ పాప 'Nobody loves me' అని వ్రాసుకుంది.

కదిలిపోయాను. కానీ ఆ మాటల్లో చాలా వాస్తవముంది.

ఆ రోజు సాయంత్రమే విశాఖపట్నం వెళ్ళాలి. విమానం టికెట్లు కాన్సిల్ చేసుకున్నా డబ్బు వెనక్కు రాదు. ఆ రోజుల్లో ఆ డబ్బు చాలా పెద్ద మొత్తం. అయినా సరే వెళ్ళకుండా ఆ రెండు రోజులూ ఇంట్లో పిల్లలతో ఉండిపోయాను.

ఇది వాళ్ళు కూడా గ్రహించారు.

నా కూతురికి నేను 'బుద్ధిమంతుడు' అనే సీరియల్ కథ చెపుతూ ఉంటాను. దాదాపు నెలరోజులు సాగినా అది పూర్తవదు. అందులో హీరో రకరకాల పనులు చేస్తూ ఉంటాడు. కొన్ని మంచి, కొన్ని వెధవ పనులు.

ఈ కథ ఎంత నాటకీయంగా చెపుతానంటే పదిహేను రోజుల తర్వాత కానీ అది నా కథే అని నా భార్యకి కూడా అర్థం కాలేదు. పాపని మా ఊరు తీసుకెళ్ళినప్పుడు రవిని, రెడ్డినీ చూపించి "ఇతడేనా నీ కథలో హనుమంతుడు? అతనేనా జాంబవంతుడు?" అని అడుగుతూ ఉంటుంది.

ఇప్పటికీ నేను బాగా అలసిపోయి ఇంటికి వచ్చి బట్టలు కూడా విప్పకుండా అలాగే సోఫామీద వాలిపోతే, నా చిన్న కూతురు వచ్చి షూ విప్పి మేజోళ్ళు తీసి సర్దుతుంది.

ఆప్యాయత అనేది ఒక బ్యాంక్ అయితే నువ్వు అందులో ఎంత జమ చేస్తే రేపు నువ్వు అందులోంచి అంత తీసుకోవటానికి సౌలభ్యం ఉంటుంది.

ఇలాంటిదే మరో సంఘటన నా పెద్ద కూతురితో జరిగింది. ఆరోజు చాలామంది బంధువులు మా ఇంటికి వచ్చారు. ఏ.సి. గదులు రెండే ఉండటంతో ఆడవాళ్ళందరినీ ఒక గదిలోనూ, పిల్లల్ని మరో గదిలోనూ పడుకోమంది నా భార్య.

“మరి నాన్న ఎక్కడ పడుకుంటారు?" అని అడిగింది నా పెద్ద కూతురు.

"ఆయన బయట హాల్లో పడుకుంటారులే"

"నాన్న రేపు పొద్దున్న అయిదింటికి లేచి నాన్న క్లాసుకి వెళ్ళాలి. మాకేమీ పని లేదు. మేము పడుకుంటాం" అని పిల్లలందరినీ తీసుకెళ్ళి హాల్లో పడుకుంది.

చిన్న సంఘటనే. కానీ మనసుకి వెన్న రాసే సంఘటనలు ఇవి.

...

నా చిన్న కూతురి మీద ఒకే ఒక సారి చేయి చేసుకున్నాను. ఆ తరువాత ఆ రాత్రంతా చాలా ఫీలయ్యాను. నేను చేసినన్ని వెధవ పనులు ఎవరూ చేసి ఉండరు. కానీ ఎప్పుడూ మా అన్నలు కానీ, మా అమ్మ కానీ నన్ను కొట్టలేదు.

అటువంటిది ఆ చిన్నారిని ఎందుకు కొట్టానా అని మధనపడ్డాను.

టీచర్‌కి కోపం, ఇరిటేషన్ ఉండకూడదు. సాడిజమూ, వెటకారమూ అస్సలు ఉండకూడదు. ఈ లక్షణాలున్న ఉపాధ్యాయులు ఎవరైనా ఈ పుస్తకం చదివితే, తమ నడవడికను ఎందుకు మార్చుకోవాలో రెండు ఉదాహరణల్లో చెపుతాను.

ఒకప్పుడు నాకు బాగా కోపం ఉండేది. ఒక విద్యార్థి ఇంగ్లీషులో తప్పు చేస్తే చాక్ పీస్ విసిరేశాను. అది గురితప్పి పక్కనున్న అమ్మాయి మెడ క్రింద డ్రెస్‌లో పడింది. ఒక క్షణం ఏం చెయ్యాలో తెలియలేదు. ఆ అమ్మాయి మొహం సిగ్గుతో ఎర్రగా కంది పోయింది.

ఆమెను తర్వాత పిలిచి క్షమాపణ వేడుకున్నాను. అయినా తప్పు తప్పే కదా.

రెండోది ప్రాణాల మీద కొచ్చిన ఉదాహరణ. ఒక తండ్రి నా దగ్గరకు తన కొడుకుని తీసుకొచ్చాడు. క్రితం రోజే అతడు రైలు క్రింద తల పెట్టి ఆత్మహత్యకు ప్రయత్నించాడని, ఈ మనస్తత్వాన్ని (suicidal tendency) తగ్గించటం కోసం కౌన్సిలింగ్ చేయమనీ అడిగాడు.

‘నేను వ్యక్తిగత కౌన్సిలింగ్ చేయను, మా తరగతులలో వ్యక్తిత్వ వికాసం గురించి చెపుతాను. అదేమైనా ఫలితం చూపించవచ్చు. ప్రయత్నించండి” అన్నాను.

ఆయన దానికి ఒప్పుకుని కొడుకుని చేర్పించి వెళ్ళిపోయాడు.

ఆ మరుసటిరోజు క్లాసులో అతడిని స్టేజ్ మీదకు పిలిచి, భుజం మీద చేయి వేసి “నా మిత్రుడు గణేష్” అంటూ అతని suicidal మనస్తత్వం గురించి చెప్పాను.

ఆరోజు సాయంత్రం అతను ఇంటికి వెళ్ళిన తర్వాత ‘తాను ఆత్మహత్య చేసుకుంటున్నా’నని ఒక ఉత్తరం వ్రాసి పెట్టి వెళ్ళిపోయాడు. ఆత్మహత్యకి వ్రాసిన కారణాల్లో నా పేరు కూడా ఉందని తెలిసింది.

చెమట్లు పట్టాయి.

ఆగమేఘాల మీద అతని ఇంటికి వెళ్ళి, ఆ ఉత్తరంతో పాటూ స్నేహితుల లిస్టు తీసుకుని, హుటాహుటిన వెళ్ళి వాళ్ళను పట్టుకుని, అందరం కలిసి రైల్వే ట్రాకులన్నీ వెతికాము.

అదృష్టవశాత్తూ దొరికాడు.

నా పేరు వ్రాయటానికి కారణం చెబుతూ "నన్ను అందరి ముందూ అవమానం చేశారు. కాబట్టి నేను ఇలాంటి నిర్ణయం తీసుకున్నాను" అన్నాడు గణేష్.

నేను చేసిన తప్పు అర్థమయింది.

“నువ్వు నా స్నేహితుడివి. అందుకే గదా స్టేజిపై నీ భుజం మీద చెయ్యి వేసి మట్లాడాను. “అతి సమీప భవిష్యత్తులో నువ్వు మిగతా వారందరికీ ఒక మార్గదర్శిగా, స్ఫూర్తి ప్రదాతగా నిలవబోతున్నావు’ అని నీ కన్నా పిరికి విద్యార్థులకి చూపించటం కోసమే నిన్ను స్టేజి ఎక్కించాను” అంటూ చాలా సేపు నచ్చచెప్పిన తర్వాత మనసు మార్చుకున్నాడు.

మూడు నెలల కౌన్సిలింగ్‌లో గణేష్ ఎంతగా మరాడంటే పూర్తిగా సానుకూల ఆలోచనా ధోరణితో మా సంస్థ నుంచి బయటకు వెళ్ళాడు. ప్రస్తుతం అతడు ఒక పెద్ద కంపెనీలో హెచ్.ఆర్. మేనేజర్‌గా పని చేస్తున్నాడు.

---

విద్యార్థులతో అనుభవాలు చాలా గమ్మత్తుగా ఉంటాయి.

ఒకరోజు ఒక కుర్రవాడు వచ్చి "సార్. మీరు నాకొక సహాయం చేయాలి" అన్నాడు.

"ఏమిటి?" అని అడిగాను.

"మన ఇన్‌స్టిట్యూట్లోనే చదుకుంటున్న ఒక అమ్మాయిని నేను ప్రేమించాను. ఆ అమ్మాయికి ఈ విషయం మీరే చెప్పాలి" అన్నాడు.

“మేధా స్పోకెన్ ఇంగ్లీష్ నేర్పే సంస్థ. వధూవరులను కలిపే వివాహ వేదిక కాదు” అన్నాను కాస్త కోపంగా.

“కొద్ది రోజుల్లో ఆ అమ్మాయి కోర్సు అయిపోతుంది”.

"నేను చెప్పటమెందుకు? నువ్వే చెప్పొచ్చు కదా" అన్నాను.

"అది కాదు సార్. మీరు చెపితే మర్యాదగా ఉంటుంది. నేను ఆ అమ్మాయిని ప్రేమించటమే కాదు. పెళ్ళి కూడా చేసుకోవాలని అనుకుంటున్నాను. ఒకవేళ ఆ అమ్మాయి ఒప్పుకుంటే వాళ్ళ ఇంటికి నేను మా పెద్దవాళ్ళని పంపిస్తాను" అన్నాడు.

అతడంత మర్యాదగా చెపుతూ ఉంటే, ఇందులో నాకేమీ అభ్యంతరం కనబడ లేదు. మరుసటిరోజు ఆ అమ్మాయిని చాంబర్‌లోకి పిలిచి "నిన్ను ఒక అబ్బాయి ప్రేమిస్తున్నాడు. మీకు ఇష్టమైతే అతడికి ఓకే చెప్పొచ్చు" అన్నాను.

"ఎవరా అబ్బాయి?" అని అడిగింది.

"ఒక అబ్బాయి నిన్ను ప్రేమిస్తున్న విషయం ఇంతకాలం నీకు తెలీకుండానే ఉందా? ఒకసారి మనసులోకి తొంగి చూడు. నీకే అర్థమవుతుంది" అన్నాను కవిత్వ ధోరణిలో.

ఇది జరిగిన మరుసటిరోజు ఆ అమ్మాయి ఆత్మహత్యా ప్రయత్నం చేసింది.

ఎందుకో నాకు అర్థం కాలేదు. ఈ అబ్బాయి ఏమన్నా బెదిరించాడా అనుకున్నాను. కానీ అతడికి అంత సీను లేదు. అమ్మాయి 'నో' అంటే తనే చేసుకునే రకం.

మేమందరం ఆసుపత్రికి వెళ్ళాం. తండ్రిని ఓదార్చాను.

కొన్ని రోజుల తర్వాత ఆ అమ్మాయి కోలుకుని ఆసుపత్రి నుంచి వచ్చాక, నా దగ్గరకు వచ్చింది.

"మా ఇంట్లో వాళ్ళు ఒప్పుకున్నారు" అంది.

“కంగ్రాచ్యులేషన్స్. పెళ్ళెప్పుడు?” అన్నాను.

"మీరెప్పుడంటే అప్పుడే" అంది.

ఆ అమ్మాయి చెపుతున్నది నాకర్థం కాలేదు. "నేను ఒప్పుకోవటం ఎందుకు? మీరిద్దరూ ఒప్పుకోవాలి కదా" అన్నాను.

"అదేనండీ. మనం ఇద్దరం ఎప్పుడు అనుకుంటే అప్పుడే చేసుకోవచ్చు" అంది ముసి ముసిగా (!) సిగ్గు పడుతూ.

నాకు స్పృహ తప్పుతున్నట్టు అనిపించింది. అదృష్టవశాత్తూ నాకప్పటికి పెళ్ళవలేదు కానీ ఆ అమ్మాయి చేసుకున్న అపార్థం మాత్రం అర్థం అయింది.

జరిగినదంతా వివరించాను. మొహం చిట్లించి "ఆ దరిద్రుణ్ణా" అంది.

నా పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా అయింది. ఆ అమ్మాయి లేచి "నేను మీరనుకున్నాను. అందుకే మా ఇంట్లో చెప్పాను. వాళ్ళు ఒప్పుకోకపోయేసరికి ఆత్మహత్యా ప్రయత్నం కూడా చేశాను. ఇప్పుడు మీరు కాదంటే ఎలా?" అంది.

"నాకు మీమీద అలాంటి అభిప్రాయం లేదు. నన్ను క్షమించండి. మీరు నా శిష్యురాలు. నేను చేసినది తప్పే. ఇంకొకళ్ళ వ్యక్తిగత విషయాల్లో వేలు పెట్టకూడదన్న గుణపాఠాన్ని ఈ సంఘటన నాకు నేర్పింది" అన్నాను.

ఆమె ఒక్క క్షణం మౌనంగా ఉండి "థాంక్యూ సర్" అని వెళ్ళిపోయింది.

---

కొన్నిసార్లు తెలీకుండా చేసిన పనులు కూడా మంచి పరిణామాన్నిస్తాయి. ఒక కుర్రవాడు వెయ్యిరూపాయలు ఫీజు కట్టి, చేరిన మరుసటి రోజు వచ్చి పోలీసులు తన బైకు పట్టుకున్నారనీ, అర్జెంటుగా అయిదువందలు కావాలనీ, ఈ విషయం నాన్నకి తెలిస్తే చంపేస్తాడనీ అన్నాడు.

ఇమ్మని మా క్యాషియర్‌కి చెబితే ఆమె, "ఇతడు పూర్తిగా ఫీజు కట్టలేదు. కేవలం వెయ్యి రూపాయలే కట్టాడు. మళ్ళీ అందులో అయిదు వందలు తీసుకుంటున్నాడు" అన్నది.

"ఫర్లేదు. ఇచ్చి పంపించండి. నాన్నకి తెలిస్తే తిడతాడంటున్నాడుగా" అని డబ్బు సర్ది పంపించాను.

మూడురోజులు పోయిన తర్వాత మళ్ళీ వచ్చి "ఇంకో వెయ్యి రూపాయలు కావాలి సార్. మా అమ్మ ఆసుపత్రిలో ఉంది" అని కన్నీళ్ళతో అడిగాడు.

"మన దగ్గర ఇతడి డబ్బు ఇంకా అయిదువందల రూపాయలు మాత్రమే ఉంది. ఇది పూర్తిగా ఎగ్గొట్టే బాపతు" అని క్యాషియర్ హెచ్చరించింది.

"తన దగ్గరివాళ్ళకి ఒంట్లో బాగాలేదని అంటున్నాడు కదా. ఇవ్వండి" అన్నాను.

మనిషిమీద ఆమాత్రం విశ్వాసం ఉండాలని నా ఉద్దేశ్యం.

కానీ ఆ డబ్బు తీసుకున్న తర్వాత అతడు మళ్ళీ కనబడలేదు.

రెండు నెలలు గడిచినా కూడా అతడి జాడ తెలియలేదు.

"నేను అప్పుడే చెప్పాను కదండీ" అన్నది క్యాషియర్.

ఆ సంగతి క్రమక్రమంగా మేము మర్చిపోయాము.

దాదాపు రెండు సంవత్సరాల తర్వాత దుబాయి నుంచి నాకొక ఉత్తరం వచ్చింది.

"మేధ ఇన్‌స్టిట్యూట్ చాలా కమర్షియల్ అనీ, అక్కడ ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తారనీ నా స్నేహితులు చెప్తే, పరీక్షించటం కోసం నేను చేరానే తప్ప నాకు ఇంగ్లీష్ నేర్చుకోవాలనే కోరిక లేదు. కేవలం మా స్నేహితులతో బెట్ కట్టి ఆ పరిస్థితులలో అలా చేశాను సార్. కానీ మీరు మంచి హృదయంతో అయిదు వందలు ఎక్కువ ఇచ్చారు. ప్రస్తుతం నేను దుబాయిలో మంచి స్థాయిలో ఉన్నాను. అందుకనే ముప్పై అయిదువేల రూపాయల చెక్కు పంపిస్తున్నాను. నేను చేసిన తప్పుకి పరిహారంగా పదిమంది విద్యార్థులకి మీ సంస్థలో ఉచితంగా చదువు చెప్పండి" అని వ్రాశాడు.

"బాస్ ఈజ్ ఆల్వేస్ రైట్" అన్నాను మా క్యాషియర్‌తో నవ్వుతూ.

ఈ సంఘటన ఇలా జరిగింది కాబట్టి ఆ మాట అనగలిగాను. అతను కానీ ఆ డబ్బు పంపించకపోయుంటే "అసిస్టెంట్ ఈజ్ ఆల్వేస్ రైట్" అనుకునేవాడినేమో. ఇప్పటికీ ఆ ఉత్తరాన్ని ఫ్రేమ్ కట్టించి ఉంచాము.

మొత్తానికి విద్యార్థులతో ఇటువంటి సంఘటనలు కోకొల్లలు.

ఎంతమంది విద్యార్థులని మేధ మార్చిందో తెలీదు కానీ నిశ్చయంగా నా మనస్తత్వాన్ని మార్చటానికి మాత్రం మేధ చాలా సహాయపడింది.

## *36*

డాల్ఫిన్ హోటల్‌లో జరిగిన ఒక పార్టీలో ఒక విలేఖరి కలిసాడు. “తెలంగాణా నుంచి ఇంత దూరం ఎందుకు వచ్చార”ని ప్రశ్నించాడు.

దానికి సమాధానంగా, ఆర్.టి.సి. బస్‌స్టాండ్‌లో పడుకోవటం దగ్గర్నుంచీ సులభ్ కాంప్లెక్స్‌లో స్నానం చేయటం వరకూ జరిగింది క్లుప్తంగా చెప్పాను. అంతా విని, "మంచి కథ చెపుతున్నారు. ఇదంతా నిజంగా జరిగిందా?" అని అడిగాడు.

తేదీలతో సహా అన్ని విషయాలూ చెప్పి, తొలి రోజుల్లో దినపత్రికల్లో వచ్చిన ప్రకటనలు చూపిస్తే అతడికి నమ్మకం కలిగింది. ఆ రాత్రి ఆ విషయం మర్చిపోయాను. కానీ చాలా ఆశ్చర్యకరంగా మరుసటి రోజు ‘ఈనాడు’లో ఒక పెద్ద వ్యాసం వచ్చింది.

(కొనసాగింపు వచ్చే సంచికలో..)